# ఎంసెట్ మే 12న

(మొదటి పేజీ తరువాయి)

సాయంత్రం 5:30 గంటల వరకు అగ్రికల్చర్, మెడికల్ ప్రవేశాలకోసం పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంసెట్ పరీక్షకు నిమిషం ఆలస్యమైనా అనుమతించేదిలేదని పాపిరెడ్డి స్పష్టంచేశారు. అనంతరం మే 13న ఎంసెట్ ప్రాథమిక కీని విడుదల చేయనున్నారు. మే 18 వరకు కీపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. అనంతరం మే 22న ఎంసెట్ ఫలితాలను వెల్లడించనున్నారు. ఇక ఎంసెట్ దరఖాస్తు చేసుకునే ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.250, ఇతరులు రూ.500ల చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కాగా, ఎంసెట్ నిర్వహణ కోసం మొత్తం 25 రీజినల్ సెంటర్లను ఏర్పాటుచేశారు. ఈ యేడాది తెలంగాణలో కొత్తగా నిర్మల్, భువనగిరి, శంషాబాద్, పెద్దపల్లిలో రీజినల్ సెంటర్లను ఏర్పాటుచేశారు. ఏపీలో రీజినల్ సెంటర్ల సంఖ్యను నాలుగు నుంచి మూడు (తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం)కు తగ్గించినట్లు చైర్మన్ పాపిరెడ్డి తెలిపారు.

## ఆయూష్ ప్రవేశాలపై లేఖ..

ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో జాతీయ స్థాయి అర్హత పరీక్ష(నీట్) ద్వారానే ప్రవేశాలు చేపట్టాలని నిర్ణయించిన విషయం తెలిసిందే! అయితే వైద్య కోర్సుల్లో భాగమైన ఆయూష్ ప్రవేశాలపై ఇంకా స్పష్టతరాలేదు. నీట్ ద్వారా ఆయూష్ ప్రవేశాల భర్తీకి సంబంధించి కేంద్రం నుంచి తమకు ఎలాంటి సమాచారం అందలేదని పాపిరెడ్డి తెలిపారు. దీంతో ఆయూష్ సీట్లనుకూడా ఎంసెట్ ద్వారానే భర్తీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. అదేసమయంలో దీనిపై స్పష్టతకోసం తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖకు లేఖ రాయనున్నామని, శాఖ నిర్ణయానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు సంబంధించి దేశ వ్యాప్తంగా ఒకే ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు కేంద్రం ఏర్పాటు చేయబోయే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విషయంలోనూ తమకు పూర్తి సమాచారం లేదని ఆయన వివరించారు.

## ఆఫ్‌లైన్‌లోనే పరీక్ష..

ఈ యేడాది ఎంసెట్‌లోని 2 పరీక్షలను పూర్తిగా ఆఫ్‌లైన్ విధానంలోనే నిర్వహించనున్నట్లు పాపిరెడ్డి తెలిపారు. గత ఏడాది మెడికల్ స్ట్రీమ్ పరీక్షను ప్రయోగాత్మకంగా ఆన్‌లైన్‌లోనూ నిర్వహించారు. ఇది సత్ఫలితాలనిచ్చినా దానిని కొనసాగించేందుకు అధికారులు సుముఖంగాలేరు. ఇంజనీరింగ్‌కు భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం, మెడికల్ స్ట్రీమ్‌కు ఆదరణ లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, గత ఏడాది ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు సెంటర్లు ఇవ్వకపోవడంతో ఎంసెట్ పరీక్షను ప్రభుత్వ కాలేజీల్లోనే నిర్వహించిన విషయం తెలిసిందే! అయితే ఈ ఏడాది సెంటర్లు ఇస్తామంటూ ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు తమను సంప్రదించాయని పాపిరెడ్డి తెలిపారు. దీంతో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రైవేటు కాలేజీల్లోనూ ఎంసెట్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాగా, ఇంజనీరింగ్ కాలేజీల అఫిలియేషన్ ప్రక్రియను ఏప్రిల్ నాటికి పూర్తిచేస్తామని జేఎన్‌టీయూ వీసీ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఎంసెట్ ప్రవేశాల నాటికి ఇంజనీరింగ్, ఇతర కోర్సుల్లో అందుబాటులో ఉన్న సీట్లపై స్పష్టతనిస్తామని తెలిపారు.

## ఇదీ షెడ్యూల్..

| విషయం | తేదీ |
|---|---|
| నోటిఫికేషన్ జారీ | 27-02-2017 |
| ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల ప్రారంభం | 03-03-2017 |
| దరఖాస్తులకు చివరి తేదీ (అపరాధ రుసుంలేకుండా) | 03-04-2017 |
| దరఖాస్తుల్లో తప్పుల సవరణకు అవకాశం | 07-04-2017 నుంచి 20-04-2017 |
| 500 జరిమానాతో దరఖాస్తుకు | 12-04-2017 |
| రూ.1000 జరిమానాతో.. | 21-04-2017 |
| రూ. 5వేల జరిమానాతో.. | 29-04-2017 |
| రూ. 10వేల జరిమానాతో.. | 08-05-2017 |
| హాల్ టికెట్ల డౌన్‌లోడ్.. | 01-05-2017 నుంచి 09-05-2017 |
| ఎంసెట్ పరీక్ష | 12-05-2017 |
| ప్రాథమిక కీ విడుదల | 13-05-2017 |
| అభ్యంతరాల స్వీకరణ | 18-05-2017 |
| ర్యాంకుల విడుదల | 22-05-2017 |